ఆడది మగాడిలా ప్రవర్తించినా అన్యాయం జరిగేదెవరికి?

ఇంగువ అన్నపూర్ణ కథ

# పు(తి)రోగమనం

"సారీ డియర్ లేటయింది. ఒక ఫ్రెండ్‌ని ఇంటిదగ్గర డ్రాప్ చేసి వచ్చేసరికి ఆలస్యమయింది... అలా చూడకు రేపువెళ్దాంలే సినిమాకు" వేనిటీ బ్యాగ్‌ను సోఫాలో పడేసి బద్ధకంగా కూచుండిపోయింది విశాల.

'ఆడఫ్రెండా, మగఫ్రెండా?' గొణుక్కున్నాడు కన్నారావు. గొణుక్కుంటూనే వంటింట్లోకెళ్ళి కాఫీ పట్టుకొచ్చాడు.

కాఫీ కప్పు అందుకుంటూ "ఏమిటో గొణుక్కుంటున్నట్లున్నావ్? రేపెళ్దాం అన్నానుగా. ఇలా కూర్చో ఇవాళ భలే గమ్మత్తయిన విషయం జరిగిందిలే" కన్నారావు చేయి పట్టుకుని తన ప్రక్కనే కూచోబెట్టుకుంటూ అన్నది విశాల.

ఇప్పటికి వారం రోజులుగా గమనిస్తున్నాడు తను. రోజూ ఆవిడగారు రాత్రి పది దాటాకే రావడం. ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ తను జపం చేయాలి. ఈవిడగారొచ్చేదాకా. అసలే రోజులు బాగా లేవు. మొన్నటికి మొన్నేమయింది. తను చూస్తూనే వున్నాడు. పక్కింటి సుబ్బారావు భార్య ఆఫీసుకెళ్ళగానే బట్టలుతికి ఆరేసి, స్నానం చేసి భోజనానికి కూర్చున్నాడు. అప్పుడే ఎవత్తో వచ్చింది మీటరు రీడింగు చూడాలంటూ. చూసి వెళ్ళిపోకుండా కబుర్లు మొదలెట్టింది సుబ్బారావుతో. అసలే సుబ్బారావుగాడి బుద్ధి చంచలం. వాడి వాలకం కనిపెట్టేసినట్లుంది అది.

"మీరు భోంచేసిరండి కూచుంటాను" అంటూ చనువుగా సోఫాలో కూచుంది.



సుబ్బారావుగాడి ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. సాయంత్రం ఆరింటికి కానీ ఆవిడగారు రారు. అంతవరకు బాగా ఎంజాయ్ చెయ్యొచ్చు.

ఈవిడెవరో చదువుకున్నదానిమల్లేవే వుంది. పాతికేళ్ళుంటాయేమో. ఊహల్లో తేలిపోతూ చకచకా భోంచేసి గిన్నెలు సర్దేసి ముందు హాల్లోకి వచ్చాడు గ్లాసులో షర్బత్

తీసుకుని. అక్కడ కొస్తూనే కొయ్యబారిపోయాడు. తను అప్పుడే సుబ్బారావు ఇంటివైపు వెళ్ళాడు కాస్సేపు కబుర్లు చెప్పుకోవాలని. తనను చూస్తూనే భోరుమని ఏడ్చేశాడు సుబ్బారావు. చాలాసేపు బ్రతిమిలాడి అడిగితే అప్పుడు చెప్పాడు ఆ అమ్మాయి హాలులోవున్న టేప్‌రికార్డరు, చేతిగడియారం, పోర్టబుల్ కలర్‌టీవీ ఎత్తుకుపోయిందని.

ఆ సాయంత్రం వాళ్ళావిడగారిచేత చచ్చేట్లు చివాట్లు తిన్నాడు సుబ్బారావు. నానా బూతులు తిట్టింది వాడ్ని. వినలేక, సిగ్గేసి తను వచ్చేశాడు.

"ఎక్కడుంది నీ ధ్యాస, పిలుస్తుంటే పలకవేం?" డొక్కలో కలుక్కుమనేసరికి స్పృహలోకొచ్చాడు కన్నారావు. ముక్కుపుటాలకు ఏదో ఘాటుగా వాసన తగుల్తోంది. కూర మాడుతోందా? చచ్చాం. గబాలున లేచి వంటింట్లోకి పరిగెట్టాడు కన్నారావు.

"సాయంత్రంపూట త్వరగా వస్తూ వుండండి. నాకు భయంగా వుంటుంది" మర్నాడు విశాల తయారయి ఆఫీసుకు వెళ్తుంటే మెల్లిగా అన్నాడు కన్నారావు.

ఇంతెత్తున లేచింది విశాల "ఆడవాళ్ళకి బయట సవాలక్ష పనులుంటాయి. త్వరగా రావాలంటే ఎలా కుదురుతుంది? మీ అమ్మనడిగి ఒక యాభై లక్షలు రూపాయలు పట్టుకురా బ్యాంకులో వేసుకుని వడ్డీ తింటూ కూర్చుందాము. నేను ఉద్యోగం మానేస్తాను" కోపంగా వెళ్ళి స్కూటరు స్టార్టుచేసి వెళ్ళిపోయింది.

కన్నారావు ముఖం కందగడ్డలా తయారైంది. హు ఏది మాట్లాడినా మీ అమ్మనడిగి డబ్బు తేపో అంటారు. మా అమ్మ మాత్రం ఎంతకని ఇస్తుంది. నేనొకడ్నే కాదుగా, కోపంగా చేతిలో గరిటను నేలకేసి కొట్టి లోపలికెళ్ళిపోయాడు కన్నారావు.

* * *

గంటసేపు బస్సుకోసం ఎదురుచూసి చూసి కాళ్ళు పీకుతున్నాయి కన్నారావుకి.

"పోనీ ఆటోలో వెళ్దామా?" బెదురుతూ ఆమె చేయి పట్టుకుని మెల్లగా అడిగాడు.

కోపంగా చూసింది విశాల అతనికేసి. ఇద్దరూ ఆటోల స్టాండువైపు వచ్చారు. ఆటోల డ్రైవర్లంతా కబుర్లలోపడి వీళ్ళని గమనించలేదు. నాలుగైదు సార్లు పిలిచాక ఒక డ్రైవరు తిరిగి చూసి

"మీటరుమీద యాభై రూపాయలు" అన్నది నిర్లక్ష్యంగా.

"ఎక్కడికి వెళ్ళాలో అడక్కుండానే?" ఆశ్చర్యంగా చూసింది విశాల.

"ఎంతదూరమైనాసరే" ఇష్టముంటే ఎక్కండి అన్నట్లు మొహం పెట్టింది.

'సరే పద' అంటూ కన్నారావుని ఎక్కమని, తనుకూడా ఎక్కింది. ఆటో బయలుదేరి పది సెకండ్లయిందో లేదో వెనుకనుంచి బస్సు వచ్చింది. విశాల కన్నారావువైపు కొరకొరా చూసింది. ఇదంతా నీ వల్లనే అన్నట్లు. పది నిమిషాల్లో ఆటో డాక్టరుగారి డిస్పెన్సరీ ముందాగింది.

ఆటోకి డబ్బులిచ్చేసి లోపలికి నడిచింది విశాల. వీరిద్దరూ లోపలికి వెళ్ళేసరికి డిస్పెన్సరీ లోపలి రూంలోంచి గట్టిగా డాక్టరుగారి గొంతు విన్పిస్తున్నది. కోపంగా వుంది ఆవిడ గొంతు.

"నీకెన్నిసార్లు చెప్పాను. లేడీస్ వస్తే నువ్వు చెక్ చెయ్యవద్దు నాకు నచ్చదు అని. నేను లేకపోతే వచ్చేదాకా ఆగమనాలి. నువ్వు కేవలం ఇంజెక్షన్లు ఇచ్చి డ్రెస్సింగ్ చేస్తే చాలు, చెకప్‌లు నేను చేస్తానని చెప్పానా? ఎప్పుడెపుడు అవకాశం వస్తుందా అని చూస్తూ వుంటావు. మళ్ళీ ఒకసారి మీ అమ్మదగ్గరికి పంపిస్తేకాని లాభం లేదు" అంటూ లేడీ డాక్టరు బయటికి వచ్చింది. వచ్చి విశాలను చూసి నవ్వుతూ పలకరించింది. ఆమె వెనుకే ఆవిడ భర్త అనబడే అవతారం బయటికి వచ్చింది.

అతడిని చూడగానే కన్నారావు కిసుక్కున నవ్వబోయి, విశాల అతనివైపు చురుగ్గా చూడ్డంతో నోరు నొక్కుకున్నాడు.

"చెప్పండి ఏమిటి విశేషాలు?" డాక్టరు అడిగింది.

"రిపోర్టు గురించి ఎంక్వైరీ చేద్దామని..."

"ఓ అదా.. గుర్తొచ్చింది. మీ రిపోర్టు వచ్చింది" అంటూ భర్తవైపు చూసింది. ఆ చూపు గ్రహించిన అవతారం బయటికి నడిచాడు. అతని వెనకాలే కన్నారావుకూడా బయటికి వెళ్ళాడు.

"హు ఏవిటో ఈ జీవితం!" ఆకాశంలోకి చూసి దిగులుగా అన్నాడు అవతారం.

"ఏమయింది గురూ. ఎందుకు అంత దిగులు?" కన్నారావు సిగరెట్టు వెలిగించి అవతారానికికూడా ఆఫర్ చేశాడు.

"అమ్మో సిగరెట్టా, కళ్ళతో చూసి ఎన్నాళ్ళయిందో? వాసన పసిగట్టిందంటే ఆవిడగారు బ్రతకనివ్వదు. సంపాదన అంతా సిగరెట్లకే పోతోంది. పుట్టింటినుంచి తేపో



అంటుంది... అవునూ మీ ఆవిడ ఏమనదా నువ్వు సిగరెట్లు కాలిస్తే?... అలా దూరంగా వెళ్ళి కాలుద్దాం పద..."

కన్నారావు ఛాతీ ఉప్పొంగిపోయింది గర్వంతో. తనెంత అదృష్టవంతుడు. రోజుకి ఒక పెట్టె సిగరెట్లు తగలేసినా విశాల ఏమీ అనదు. తనే విశాలని తప్పుగా అర్థం చేసుకుంటుంటాడు. ఇకనుంచి విశాల ఏమన్నా పట్టించుకోకూడదు. తన పూర్వజన్మ పుణ్యం వలన అటువంటి భార్య దొరికింది.

"మా తాతయ్య కాలంలో అయితే ఇలా వుండేవాళ్ళు కాదుట ఆడవాళ్ళు. ఉద్యోగాలు చేసి సంపాదించినా మొగుడి మాట వినేవార్ట" అన్నాడు అవతారం.

"అవునట. మా నాన్న చెప్పేవాడు. మళ్ళీ ఇదివరకటి రోజులువచ్చేస్తే బాగుండు." అని ఆగాడు కన్నారావు.

"అప్పుడు మనమే కట్నం తీసుకోవచ్చు" సంబరంగా అన్నాడు అవతారం.

"అందుకే నేను మెన్స్‌లిబ్‌లో చేరుదామనుకుంటున్నాను" అంతకుముందే తను భార్యగురించి అనుకున్న మాటలు మర్చిపోయాడు కన్నారావు.

సిగరెట్టు చివరకంటా తగలేసి దూరంగా విసిరేసాడు అవతారం. "పద వెళ్దాం. పేషెంట్లు వచ్చేసరికి నేను సహాయం లేకపోతే ఆవిడ మళ్ళీ కోపగించుకుంటుంది"

ఇద్దరూ డిస్పెన్సరీకి వెళ్ళేసరికి విశాల ఎదురు చూస్తోంది కన్నారావుకోసం.

"ఎక్కడికెళ్ళావు? ఇంతమంది పేషంట్లు చెక్ చేయించుకోటానికొచ్చారు. సమయానికి ఎటెళ్ళావు?" అన్నది డాక్టరు అవతారంవైపు అనుమానంగా చూస్తూ.

"అబ్బె... ఎక్కడికెళ్తాను... అలా చల్లగాలికి కాస్సేపు బయట నిలబడ్డాను..." తడబడుతూ ఆమె తననోర్రు ఎక్కడ వాసన పడుతుందో అని భయపడుతూ లోపలికెళ్ళాడు అవతారం.

విశాల, కన్నారావు బయటకొచ్చారు. డాక్టరుగారు ఏం చెప్పిందో అడగనా వద్దా? సంశయంలో పడ్డాడు కన్నారావు.

ఈసారి బస్సు తేలిగ్గానే దొరికింది. విశాల ఎక్కగానే తనూ పరిగెత్తుతూ బస్సెక్కేశాడు. స్టాపులో రెండ్నిముషాలన్నా ఆపకపోతే మగాళ్ళెలా ఎక్కుతారు? గుర్రుగా చూశాడు డ్రైవరువైపు.

"హిడింబి" పళ్ళునూర్తూ కసిగా అన్నాడు డ్రైవర్ని చూస్తూ.

"అంటే ఏంటి?" కండక్టరు టిక్కెట్టిస్తూ అడిగింది.

"ఒక మహా పతివ్రత వుండేదిట భారతం అనే గ్రంథంలో. ఆవిడ పేరది"

"నీకెవరు చెప్పారు?" విశాల అడిగింది. ఈ లోపల మగవాళ్ళ సీటు ఒకటి ఖాళీ అయింది. కన్నారావు కూర్చున్నాడు. విశాలకు సీటు దొరకలేదు.

"ఇలా కూర్చో" తన ప్రక్కన చోటు చూపించాడు.

"వద్దులే. మధ్యలో చెకింగ్ జరిగితే కష్టం... ఈ మధ్య రోజూ చెకింగ్‌కొస్తున్నది"

ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది.

టెస్టు రిపోర్టు గురించి తనకు విశాల చెప్తుందని ఓపిగ్గా ఎదురు చూస్తున్నాడు కన్నారావు. విశాల తనంతట తను చెప్పటంలేదు. అడిగితే కసురుతుందో ఏమో!

విశాల నిద్రపోయిందని నిర్ధారించుకున్నాక, మెల్లగా చప్పుడుకాకుండా మంచం దిగాడు కన్నారావు. దిగి విశాల బ్యాగ్ కోసం ఆ చీకట్లోనే గాలించాడు. టేబిల్ మీద వుంది. పెన్ టార్చ్ వెలిగించి, బ్యాగ్ తెరిచి డాక్టరిచ్చిన రిపోర్టు కవరు బయటికి తీశాడు. అతని చేతులు ఒణుకుతున్నాయి. విశాలకాని లేస్తే? ఆమె పడుకున్నవైపుచూసి, బ్యాగ్ మూసేసి చేతిలో కవరుతో బాత్రూమ్‌లోకి నడిచాడు కన్నారావు...

అయిదు నిమిషాల తర్వాత బయటికి వచ్చిన కన్నారావు ముఖం వెయ్యి క్యాండిల్ బల్బులా ఆనందంతో వెలిగిపోతోంది. ఎంత మంచివార్త! చెప్పకుండా ఎలా దాచేసుకుందో. మరీ మొగుడిదగ్గరకూడా అంత దాపరికమెందుకో.

కవరు మళ్ళీభద్రంగా బ్యాగ్‌లో వుంచేసి, బ్యాగ్‌ని యథాస్థానంలో వుంచేసి పక్కమీదికి చేరి విశాల ప్రక్కన వాలిపోయాడు. ప్రేమగా మీద చెయ్యివేసి, దగ్గరకు తీసుకోవాలన్పించింది. నిద్ర పాడయిందని విసుక్కుంటుందేమో. అసంతృప్తిగా ఫీలయ్యాడు. ఆ అసంతృప్తిలోంచి ఏదో ఆశాకిరణం కన్పిస్తుంటే కళ్ళు మూసుకున్నాడు కన్నారావు.

* * *

"నో... అలా జరగనివ్వను... నేనొప్పుకోను" చేతిలోవున్న పప్పుగరిటని టేబుల్ మీద కొడుతూ ఆవేశంగా అన్నాడు కన్నారావు.

"నువ్వెవరివి ఒప్పుకోకపోవడానికి?" సోఫాలో కూర్చుని ఆఫీసు ఫైల్సు తిరగేస్తున్న విశాల నిర్లక్ష్యంగా అన్నది.



### పాట

అర్ధరాత్రి పూట బాబు ఏడుపు మొదలెట్టాడు. చుట్టు పక్కల వాళ్లకి నిద్రపాడవుతుందని బాబుని నిద్రపుచ్చడానికి జోలపాట మొదలెడుతుంది బాబు తల్లి.

ఇంతలో చుట్టుపక్కలి వాళ్ళంతా వచ్చి—

"ఆపవమ్మా. నీ పాటకన్నా వాడి ఏడుపే నయం" చిరాగ్గా అని వెళ్ళిపోయారు.

—శివలీల (కవాడిగూడ)

"నేను నీ మొగుణ్ణి"

"నోర్మూయ్. మొగుట్ట మొగుడు... ఇది నీ తాతల కాలం కాదు నేను మొగుణ్ణి అనగానే వణికిపోతూ నీ కాళ్ళు పట్టుకోటానికి. ఇష్టముంటే వుండు. కష్టమయితే మీ పుట్టింటికెళ్ళిపో. ఈ ఇంట్లో ఏది జరిగినా నా ఇష్ట ప్రకారమే జరగాలి. జరుగుతుంది. ఇష్టమయితేనే వుండు" ఈ మగవెధవలకి బొత్తిగా అలుసివ్వకూడదు. అధికారం చలాయించాలని చూస్తారు!

"ఇది చాలా అన్యాయం..." ఉక్రోషంగా అన్నాడు కన్నారావు. కన్నీళ్ళొక్కటే తక్కువ. అందరు ఆడవాళ్ళకన్నా విశాల ఎంతో మంచిది అనుకున్నాడు తను. తనకెంతో కొంత గౌరవం ఇస్తుందని తోటి మగవాళ్ళతో చెప్పుకుని గర్వపడ్డాడుకూడా. చివరికి అందరు ఆడవాళ్ళలాగే ప్రవర్తిస్తున్నది!

"ఏది?"

"పెళ్ళికి మగవాడు కావాలికానీ, కనడానికి మగపిల్లవాడు వద్దు అనడం అన్యాయం"

"ఇదేమాట ఒకప్పుడు ఆడవాళ్ళు అడిగారు. దానికి మగవాళ్ళేమన్నారు? ఆడపిల్లని పెంచడం, వేయి కళ్ళతో కాస్తూ, పెళ్ళిచేసి పంపడం కంటే వైతరణి దాటటం తేలిక అన్నారు. ఎన్నివేల, లక్షల ఆడ శిశువుల్ని మీ మగవాళ్ళు గర్భంలోనే చంపలేదు? అది అన్యాయమని ఒక్క మగవెధవైనా అన్నాడా? ఆ శిశువుల ఆక్రందనలు ఎవరికైనా విన్పించాయా? ఆ వుసురు ఊరికే పోతుందా?" విశాల వొళ్ళు కోపంతో తీవ్రంగా కంపిస్తున్నది. కళ్ళల్లోనించి నిప్పు కణాలు రాలుతున్నాయి. కొత్త విశాలను చూస్తున్నాడు కన్నారావు.

ఆమె ప్రక్కన కూర్చుంటూ అనునయంగా అన్నాడు.

"నువ్వు చెప్పేది నిజం. ఆ కాలంలో మగవాళ్ళు మూర్ఖంగా ప్రవర్తించారు. ఆ కోపం పెట్టుకుని నువ్వు మగపిల్లలే వద్దనడం ఏమైనా సమంజసంగా వుందంటావా?"

"వందేళ్ళ క్రిందట ఆడపిల్లలకి కట్నాలిచ్చి పెళ్ళి చేసేవారుట. అలా అడిగినంత కట్నాలివ్వలేక ఆడపిల్లల్ని కనగూడదని కోరుకునేవారట. ఇప్పుడు మగపిల్లల విషయంలోనూ సమస్య అదేకదా" సాలోచనగా చూసింది. ఆవేశం తగ్గింది ఆమెలో...

"అప్పటికి కట్నాలు రూపుమాసిపోతాయని ఆశిద్దాము" అంటూ గరిట తీసుకుని లోపలికి వెళ్ళాడు కన్నారావు.

విశాల ఆలోచనలో పడింది. వందేళ్ళ క్రిందట మగవాళ్ళు మూర్ఖంగా చేసిన పనే ఈ రోజు స్త్రీలు చేస్తుంటే మధ్యలో బాధననుభవించేది ఎవరు? గర్భంలోవున్న శిశువులే నిష్ప్రంశయంగా. వాళ్ళు చేసారని వీళ్ళు, వీళ్ళు చేసారని వాళ్ళు ప్రతీకారం తీర్చుకుంటే — ఇక దీన్ని పురోగమనమనాలా? తిరోగమనమనాలా?

*